క్లుప్తంగా

ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు

- 28 నుంచి జనవరి 6 వరకు వార్డుల్లో సభలు
- కమిషనర్ అల్లూరి వాణి



మీర్‌పేట: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించి ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లలో వార్డు సభలు ఏర్పాటు చేస్తామని కమిషనర్ అల్లూరి వాణి ఒక ప్రకటనలో మంగళవారం తెలిపారు. అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆమె చెప్పారు. మహాలక్ష్మి, రైతుభరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పథకాల కోసం ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను తీసుకుంటామని అన్నారు. ఈ నెల 31, జనవరి 1 తేదీన సెలవు దినాలు ఉంటాయని కమిషనర్ సూచించారు.

అయ్యప్పస్వాముల మండల పూజ



మండల పూజలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు

బడంగ్‌పేట్: వేణుగోపాలస్వామి దేవాలయంలో బాలాపూర్ అయ్యప్ప సేవా సమితి గురుస్వాముల ఆధ్వర్యంలో మంగళవారం కన్యస్వాములతో మండల పూజను నిర్వహించారు. స్వామిని కొలుస్తూ భజనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం పడిపూజను నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌గౌడ్, వెంకటాచారి, గోపాల్ యాదవ్, వినోద్‌రెడ్డి, జగన్‌రెడ్డి, శ్రీను, హరికిషన్, సదానంద్‌రెడ్డి, సీతారాంరెడ్డి, ఆనంద్, చిరంజీవి, శివారెడ్డి, నరసింహారెడ్డి తదితరులు బాలాపూర్ సేవాసమితి సన్నిధాన స్వాములు పాల్గొన్నారు.

ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి భక్తులు దర్శనం కోసం క్యూలో ఉన్నారు. ఆలయంలో సామూహిక శ్రీ సత్యనారాయణ వ్రతాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌కు సన్మానం



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న నర్సింహారెడ్డి

బడంగ్‌పేట్: న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మంగళవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను బాలాపూర్‌కు చెందిన బడంగ్‌పేట నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగురింత నర్సింహారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన స్పీకర్‌ను సన్మానించారు.

రేపటి నుంచి గ్రామాల్లో 'ప్రజా పాలన'

కందుకూరు: మండల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను ఎంపీడీఓ వెంకట్రాములు మంగళవారం ప్రకటించారు. 28న ముచ్చర్ల, దెబ్బడగూడ, సేదునూరు, పులిమామిడి, తిమ్మాపూర్, రాచులూరు 29న దాసర్లపల్లి, దాసర్లపల్లితండా, బాచుపల్లి, చిప్పలపల్లి, బేగంపేట, లేమూరు 30న ఆకులమైలారం, గుమ్మడవెల్లి, కొత్తగూడ, జైత్వారం, సరస్వతిగూడ, అగర్‌మియాగూడ జనవరి 2న కందుకూరు, అన్నోజిగూడ, ధన్నారం, మురళీనగర్, మాదాపూర్, బైరాగిగూడ 3న సాయిరెడ్డిగూడ, సార్లరావులపల్లి, కొత్తూర్, గూడూరు, పెద్దమ్మతండా, దావూద్‌గూడతండా 4న కొలన్‌గూడ, బేగరికంచె, కటికపల్లి, మీర్‌ఖాన్‌పేట, జబ్బార్‌గూడల్లో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఆయా గ్రామాల్లో తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీఓల పర్యవేక్షణలో కార్యక్రమం కొనసాగనుందన్నారు.

వామ్మో వానరాలు!

- ఇళ్లు, పొలాల్లో స్వైరవిహారం చేస్తున్న కోతులు
- చిన్నారులు, మహిళలపై దాడులకు తెగబడుతున్న వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కందుకూరు చౌరస్తా సమీపం వద్ద సంచరిస్తున్న కోతులు



ఓ ఇంటి గోడపై కూర్చున్న వానరాలు

కందుకూరు: కోతుల బెడదతో జనం బెంబేలెత్తిపోతున్నారు. విచ్చల విడి సంచారంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇళ్లు, దేవాలయాలు... ఎక్కడ చూసినా కోతుల స్వైరవిహారంతో హడలెత్తిపోతున్నారు. పంట పొలాలను వదలడం లేదు. ఒంటరిగా వెళ్తున్న మహిళలు, చిన్నారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ఇళ్లల్లోకి వెళ్లి వస్తువులను చిందరవందరగా పడేస్తున్నాయి. అయినా సంబంధిత అధికారులు మాత్రం తమకు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదీ మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రధాన సమస్య.

ఆహారం లభించక

అడవుల్లో ఆహారం లభించక కోతులు ఊర్ల మీదకు వచ్చి జీవిస్తున్నాయి. కందుకూరు, కందుకూరు చౌరస్తా, కొత్తగూడ, రాచులూరు, చీమలవానికుంట, తిమ్మాపూర్, బైరాగిగూడ, తుర్కగూడ, ఆకులమైలారం, మాలగూడ, మీర్‌ఖాన్‌పేట, సాయిరెడ్డిగూడ, ముచ్చర్ల, ఊట్లపల్లి, పోచమ్మగడ్డతండా తదితర గ్రామాల్లోకి కోతులు పెద్ద ఎత్తున సంచరిస్తున్నాయి. కొన్నేళ్లుగా ఇక్కడే స్థిరంగా ఉంటున్నాయి. ఇళ్లు, కార్యాలయాలు, దేవాలయాలు, రోడ్లు ఎక్కడ పడితే అక్కడే సంచరిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కనీసం దేవాలయాల్లో ప్రశాంతంగా పూజలు కూడా చేసుకోలేని దుస్థితి నెలకొంది. మరోపక్క ఇళ్లపై తిరుగుతూ మహిళలపై దాడులకు పాల్పడుతున్నాయి. ఇప్పటికే పలువురు గాయాలపాలైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఒంటరిగా చిన్నారులను బయటకు పంపించలేని పరిస్థితి నెలకొంది. సాయిరెడ్డిగూడ, మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల తదితర గ్రామాల పరిధిలో పంట పొలాలలో సంచరిస్తూ పంటలను తింటూ రైతులను నష్టపరుస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతులను పట్టుకుని అడవుల్లోకి తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

పూజలు చేయలేకపోతున్నాం



కోతుల పెద్ద ఎత్తున సంచరిస్తుండటంతో ఇబ్బందిగా ఉంది. దేవాలయంలో నిత్య పూజలకు ఆటంకాలు కలిగిస్తున్నాయి. భక్తులు ప్రశాంతంగా దేవుడ్ని ఆరాధించలేకపోతున్నారు. తాము పూజలు చేయలేకపోతున్నాము. కర్ర దగ్గర పెట్టుకుని పూజలు చేయాల్సి వస్తుంది.

– ప్రభాకర్‌చారి, పూజారి, సీతారామశాస్త్రినగర్

అడవుల్లోకి తరలించాలి



కోతుల బెడద ఐదారేళ్లకు పైగా మా గ్రామంలో ఉంది. ఇళ్ల వద్ద తిరగడంతో పాటు పంట పొలాల్లో సంచరిస్తూ సాగు చేసిన పంటలను నాశనం చేస్తున్నాయి. వరి, మొక్కజొన్న, కూరగాయల వంటి పంటలతో పాటు పండ్ల తోటలపై దాడి చేసి నష్టపరుస్తున్నాయి. అధికారులు స్పందించి వాటిని అడవుల్లోకి తరలించేలా చూడాలి.

– రామకృష్ణ, సాయిరెడ్డిగూడ

రేపు బీజేపీ సన్నాహక సభ

హాజరు కానున్న కేంద్ర మంత్రి అమిత్‌షా



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కొంగరకలాన్‌లోని శ్లోక కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 28 నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సభకు ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి అమిత్‌షా రాబోతున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం బాలాపూర్‌లో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం నియోజకవర్గంలో స్వల్ప తేడాతో బీజేపీ ఓటమి చెందినప్పటికి నైతిక విజయం సాధించిందని అన్నారు. ఈసారి లక్ష ఓట్లు పడటం చాలా సంతోషమన్నారు. రాబోయే ఎన్నికల్లో మరింత దూసుకు పోతామన్నారు. 1983 కంటే ముందే ఈ ప్రాంతంలో బీజేపీకి బీజాలు పడ్డాయని అన్నారు. బలమైన శక్తిగా బీజేపీ అవతరిస్తున్నదని అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అమిత్‌షాతో పాటు బీజేపీ జాతీయ నాయకులు సంతోష్, డా.లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్ పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, సుధాకర్ తదితరులున్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం

- ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేయాలి
- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

తుక్కుగూడ: ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు.. క్షేత్ర స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ సూచించారు. మంగళవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టినందుకు నియోజకవర్గ ప్రజలకు మనమంతా వారధిలా ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 28న ఆరు గ్యారంటీల అమలు కొరకు నిర్వహించే గ్రామ, వార్డు సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాతారెడ్డి, ఎంపీపీ రఘుమారెడ్డి, జానకిరామ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్

కనుల పండువగా పడిపూజ

మామిడిపల్లిలో అయ్యప్ప స్వామి భక్తుల కోలాహలం



ఊయలలో కొలువైన స్వామివారు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీబాల మణికంఠ అయ్యప్ప స్వామి దేవాలయ పరిసరాలు మంగళవారం అయ్యప్ప నామస్మరణతో మార్మోగాయి. ఉదయం గణపతి హోమం, మండల మహా పడిపూజ మహోత్సవాన్ని ప్రారంభించారు. అర్చకులు బ్రహ్మశ్రీ ఉన్నికృష్ణన్ నంబూద్రీ, ప్రసాద్ గురుస్వాముల పర్యవేక్షణలో ఈ పూజ మహోత్సవాన్ని కొనసాగించారు. శివ పార్వతుల వేషాధారణల ఆటలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్వాములు రమేష్, జగన్మోహన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రొఫెసర్ సూర్యనారాయణ, కార్పొరేటర్లు శివకుమార్, పవన్‌కుమార్ యాదవ్‌లతో పాటు కృష్ణారెడ్డి, నరేందర్‌గౌడ్, కృష్ణారెడ్డి, ధర్మారెడ్డి, కోట్ల వీరస్వామి పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న భక్తులు

దేవుడి విగ్రహం పేరిట బూటకం

ప్రతిమను పాతిపెట్టిన రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలి

- బజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ నాయకులు
- మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు



రియల్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న బజరంగ్‌దళ్ నాయకులు

మహేశ్వరం: విగ్రహాన్ని వెంచర్‌లో పాతిపెట్టి... పురాతన విగ్రహం లభ్యమైందని అబద్ధాలు ఆడి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన రియల్టర్ కాకి కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాఘవేందర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహేశ్వరం మండల కేంద్రంలోని శివగంగా రాజరాజేశ్వర ఆలయం ఎదురుగా ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్‌లో ఈ నెల 22న గ్రామానికి చెందిన రియల్టర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కాకి కుమార్ ప్లాటును జేసీబీతో చదును చేస్తుండగా.. పురాతన వేంకటేశ్వర స్వామి విగ్రహం లభ్యమైందని ప్రజలను నమ్మ బలికించారు. గ్రామస్తులు, అయ్యప్ప భక్తులకు అసలు విషయం తెలియక కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తవ్వకాల్లో బయటపడిన స్వామి విగ్రహంపై గ్రామస్తులకు అనుమానం రావడంతో పోలీసులు, పురావస్తు శాఖ అధికారులకు సమాచారం అందించారు. విగ్రహాన్ని పరిశీలించగా అది పురాతన విగ్రహం కాదని ఇటీవల తయారు చేసి పాతిన విగ్రహం అని తేల్చారు. తవ్వకాలు చేపట్టిన కుమార్‌ని పోలీసులు విచారించగా తానే ఈ నెల 19న విగ్రహాన్ని కర్నూలు జిల్లా ఆళ్లగడ్డలో కొనుగోలు చేసి మహేశ్వరంలో పాతిపెట్టానని ఒప్పుకొన్నారు. పోలీసుల సహాయంతో విగ్రహాన్ని గ్రామంలో ఉన్న ఆలయంలో పెట్టించారు. వెంచర్‌లో ఉన్న తన ప్లాట్ పక్కనే పార్కు స్థలంపైన కన్నేసి అందులో తన తల్లి పేరు మీద అనాథ ఆశ్రమం నిర్మాణం చేయాలనే ఈ నాటకం ఆడానని ఆయన అంగీకరించారు. ప్రభుత్వ భూమి, పార్కు స్థలాన్ని కబ్జా చేయడానికి దేవుడి విగ్రహాన్ని పాతి పెట్టి హిందువుల మనోభావాలు దెబ్బతీసిన రియల్టర్ కాకి కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఏసీపీ శ్రీనివాస్‌ను బజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ నాయకులు కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శివకుమార్, ఈశ్వర్, పెంటయ్య, శ్రీకాంత్, సాయికిరణ్, శివ, వినోద్, కుమార్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీపీఐ



జెండావిష్కరణలో పాల్గొన్న రవీంద్రాచారి తదితరులు

- కార్మికుల పక్షాన పోరాటాలు
- పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి

మీర్‌పేట: కార్మికులు, కర్షకుల కోసం కమ్యూనిస్టు పార్టీ ఎన్నో పోరాటాలు చేసిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి అన్నారు. పార్టీ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా మంగళవారం మీర్‌పేట కార్పొరేషన్ లెనిన్‌నగర్‌లోని మండల పార్టీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి రవీంద్రాచారి ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో లక్షలాది ఎకరాల భూములను సీపీఐ పార్టీ పేదలకు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటరమణారెడ్డి, సహాయ కార్యదర్శి నరేందర్, నాయకులు పిచ్చిరాజు, అంజయ్య, దశరథం, శేఖర్‌రెడ్డి, రజియాబేగం, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మంచు వేళ.. వాహనాలు డీలా

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

తుక్కుగూడ: చలి తీవ్రత రోజు రోజుకు విజృంభిస్తోంది. రాత్రి నుంచి ఉదయం వరకు మంచు ప్రభావం తీవ్రంగా ఉంటోంది. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీశైలం జాతీయ రహదారి, నెహ్రూ ఔటర్ రింగు రోడ్డులో మంగళవారం ఉదయం విపరీతమైన మంచు కురిసింది. దీంతో రోడ్లపై ప్రయాణం చేయడానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వస్తున్న వాహనం కనిపించకపోవడంతో పలు ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ తాత్కాలికంగా నిలిచిపోయాయి.



తుక్కుగూడలో మంచు ప్రభావం

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

వనస్థలిపురం: ఉచిత వైద్య శిబిరాలను స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని ఎల్‌బీనగర్ డీసీసీ సాయిశ్రీ అన్నారు. మంగళవారం వనస్థలిపురంలో రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలోని ఓల్డ్ ఏజ్ హోమ్‌లో కామినేని, తేజస్విని ఆసుపత్రుల సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వృద్ధులకు బీపీ, షుగర్, తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గద్దె విజయ్‌నేత, డా.మీర్యాంబాబు, డా.ఆర్.రామ్మూర్తి, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు శంకర్, శివ, ఉపేందర్‌రెడ్డి, శ్రీను, మల్లేశం గౌడ్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలని వినతి



మాట్లాడుతున్న చెన్నోజు శ్రీనివాసులు

హస్తినాపురం: నిబంధనలను విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుపుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేట్ విద్య నియంత్రణ జేఏసీ చైర్మన్ చెన్నోజు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ రహదారిపై ఏర్పాటు చేసిన మద్యం దుకాణం నిర్వాహకుడు ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాడని, ఈ దుకాణాన్ని వెంటనే తొలగించాలని ఎక్సైజ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం హస్తినాపురంలో విలేకరులతో మాట్లాడుతూ, సరూర్‌నగర్ డీపీఈఓ అండదండలతో ఎక్సైజ్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా బార్లను తలదన్నే విధంగా హస్తినాపురం చౌరస్తా దగ్గర సాగర్ రహదారిపై వైన్‌షాపు ఏర్పాటు చేశారని, వెంటనే దానిని తొలగించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని శ్రీనివాసులు హెచ్చరించారు. సమావేశంలో ఆర్.లింగస్వామి, అన్నపోసల వెంకటేశ్, పోలే విష్ణు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కాలనీవాసుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీవాసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు మంగళవారం ఆయన కమలానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు కాలనీ సమీపంలో ఉన్న వనస్థలిపురం రైతుబజారు కూడలిలో నిత్యం ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతూ కాలనీలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కాలనీలోని సమస్యలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతుబజారు వద్ద వ్యాపారాలు చేసుకునేవారు, కాలనీవాసులను సమావేశ పరిచి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు రాజ్‌కిరణ్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వరిరెడ్డి, మల్లేష్, శ్రావణ్‌కుమార్, సత్తిరెడ్డి, సుబ్బారావు, టీవీ రావు, భారత్‌సింగ్, జ్యోతిరెడ్డి, సత్యనారాయణ, గణేష్, అచ్యుత్, రామారావు, నాగమల్లేశ్వర్‌రావు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ అమలు చేయాలి

రైతు సంఘం మండల కార్యదర్శి ముసలయ్య



రైతులకు సభ్యత్వాలు అందజేస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి చీమల ముసలయ్య, అధ్యక్షుడు రామకృష్ణారెడ్డిలు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ఆదిబట్ల మున్సిపాలిటీ ఎంపీపటేల్‌గూడలో రైతు సంఘం సమావేశం నిర్వహించారు. అనంతరం రైతులకు సభ్యత్వాలను అందజేశారు. ముఖ్యఅతిథులుగా నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడుతామన్నారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు తులసిగారి నర్సింహా, పటేల్‌గూడ అధ్యక్షుడు శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన మహాయజ్ఞం

అబ్దుల్లాపూర్‌మెట్: విశ్వశాంతి శ్రేయస్సును కోరుతూ మండలం పిగ్లీపూర్ శివారులోని దేశ్‌ముఖిలో గల మౌంట్ శంబళ ది గ్లోబల్ శక్తి కేంద్రంలో ప్రతి సంవత్సరం దత్త పౌర్ణమి రోజున నిర్వహించే శ్రీ రాజసూయ గాయత్రీ మహాయజ్ఞం మంగళవారం ముగిసింది. కార్యక్రమంలో భాగంగా కాశీ నుంచి విచ్చేసిన శ్రీ సత్యానందస్వామి పర్యవేక్షణలో కార్యక్రమంలో భాగంగా దత్తపూర్ణిమ రోజున ప్రత్యేక సామూహిక దీపయజ్ఞం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజసూయ యజ్ఞంలో భాగంగా పంచ వీరభద్ర యూనివర్సిటీ ఐదవ స్నాతకోత్సవం నిర్వహించి విద్యార్థులకు పట్టాలు అందజేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సాధకులు, భక్తులు పాల్గొన్నారు.